సాక్షి కర్నూలు

గురువారం । 4 । జనవరి । 2024



కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు బుధవారం 159 క్యూసెక్కుల నీటి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.751 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం సాయంత్రం సాక్షిగణపతికి, జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. అనంతరం అభిషేకం, పుష్పార్చన జరిపించారు.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీకి చెందిన బి.పవన్‌కుమార్ రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. దాతలకు శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

న్యూస్‌రీల్

ప్రతి కార్డుదారునికీ రేషన్ అందాలి

- జేసీ నారపు రెడ్డి మౌర్య



నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న జేసీ మౌర్య

కర్నూలు (టౌన్): ప్రతి కార్డుదారునికి రేషన్ సరుకులు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య ఆదేశించారు. బుధవారం కర్నూలులోని వెంకటరమణ కాలనీ, కప్పలనగర్ కాలనీలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసే ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కార్డుదారులకు సరుకులు సక్రమంగా అందించాలని, ఇందులో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. కందిపప్పు, బియ్యం, రాగుల నాణ్యతపై కార్డుదారులతో ఆరా తీశారు. సకాలంలో వాహనం వస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

23న వైఎస్ఆర్ ఆసరా నిధుల విడుదల

- ఫిబ్రవరి 5న వైఎస్సార్ చేయూత

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా కింద నిధుల విడుదలకు షెడ్యూల్ ఖరారైంది. వైఎస్ఆర్ ఆసరా కింద స్వయం సహాయక సంఘాలకు మాఫీ నిధులు జనవరి 23న విడుదల కానున్నాయి. నిధుల విడుదలకు ముందు అంటే ఈ నెల 17 నుంచి వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నారు. డీఆర్‌డీఏ-వైకేపీ సిబ్బంది వ్యక్తిగతంగా స్వయం సహాయక సంఘాలతో సమావేశమై ఆసరా నిధుల విడుదల ఉద్దేశాలను వివరిస్తారు. 23న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి సంఘాల బ్యాంకు ఖాతాలకు నిధులు విడుదల చేస్తారని డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా తెలిపారు. ఈ నెల 23 నుంచి 31 వరకు ఆసరా సంబరాలు నిర్వహిస్తామని బుధవారం విలేకర్లకు తెలిపారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు వైఎస్ఆర్ చేయూత కింద నిధుల విడుదల కార్యక్రమాన్ని ఫిబ్రవరి 5న చేపట్టనున్నారు. చేయూతకు సంబంధించి ఈ నెల 27 నుంచి ముందస్తు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి 5 నుంచి 14 వరకు చేయూత సంబరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు



కర్నూలు సిటీ: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్రంతో పాటు పక్క రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి టీకే వెంకట రామం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, చెన్నై, నెల్లూరు, విజయవాడ నగరాల నుంచి కర్నూలు జిల్లాకు వచ్చేందుకు ఈ నెల 10వ తేది నుంచి 13వ తేది వరకు, అలాగే తిరుగు ప్రయాణాలను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు రెగ్యులర్ బస్సులతో పాటు, అదనంగా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వీసులకు రాను, పోను రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని, ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న వారికి చార్జీల్లో 10 శాతం రాయితీ ఇస్తామన్నారు. సంక్రాంతి పండుగ ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలను మాత్రమే వసూలు చేస్తామన్నారు.

సాగుకు ఫుల్ 'పవర్'

ఒకప్పుడు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని విద్యుత్.. ఏడు గంటలు అన్నారు కానీ.. రైతులకు 'ఏడు' పే మిగిలేది.. ఎండుతున్న పంటలను కాపాడుకోవడం చాలా కష్టంగా ఉండేది. కొత్త కనెక్షన్ కోసం చేసుకున్న దరఖాస్తులకు మోక్షం లభించేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల కష్టాలు తొలగాయి. నిరంతరంగా తొమ్మిది గంటల విద్యుత్ పగటి పూటే అందుతోంది. ఎక్కడా కోత పెట్టకుండా సీనియారిటీ ప్రకారం ఉచిత విద్యుత్ కనెక్షన్లు విరివిగా మంజూరు చేస్తున్నారు. మోటారు కాలిపోకుండా నాణ్యమైన విద్యుత్ అందుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



2019 నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాకు విడుదల చేసిన ఉచిత విద్యుత్ కనెక్షన్లు

సంవత్సరం	విడుదలైన కనెక్షన్లు
2019	11,693
2020	13,074
2021	8,027
2022	18,360
2023	6,724
మొత్తం	57,878

- ఉచిత విద్యుత్‌కు ప్రాణం పోసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో పెరిగిన కనెక్షన్లు
- అడిగిన వెంటనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- పగటిపూటే తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్
- మొత్తం విద్యుత్ వినియోగంలో 30 శాతంపైగా వ్యవసాయానికే
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



ఈ చిత్రంలోని రైతు పేరు బి.రాజశేఖర్. వెల్దుర్తి మండలం బోయినపల్లె గ్రామానికి చెందిన ఈయనకు 1.50 ఎకరాల పొలం ఉంది, ఏడాది క్రితం బోరు వేయించుకోగా.. నీళ్లు పడటంతో ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. ఈ ఒక్క రైతుకే ప్రత్యేకంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాల్సి వచ్చింది. 11 కేవీ లైన్ వేయడానికి, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు ఏర్పాటు చేయడానికి రూ.2.90 లక్షల వరకు ఖర్చు వచ్చింది. అయితే రైతు రాజశేఖర్ చెల్లించింది మాత్రం రూ.9 వేలు మాత్రమే. విద్యుత్ శాఖపై రూ.2.81 లక్షలు భారం పడింది. 2023 జూలైలో విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంతో బోరు కింద 1.50 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. దాదాపు 50 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. నామమాత్రపు ఖర్చుతో విద్యుత్ కనెక్షన్ విడుదల కావడం, బోరు కింద వేరుశనగ సాగుతో రైతు ఆనందం అంతా.. ఇంతా కాదు.



నూతనంగా ఇచ్చిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయాన్ని పండుగ చేయడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉచిత విద్యుత్ కనెక్షన్లు విడుదల చేయడాన్ని ముమ్మరం చేసింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఐదేళ్లలో 2,94,961 అన్ని రకాల విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వగా ఇందులో 57,878 వ్యవసాయానికి సంబంధించినవి ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం పడిపోయే నాటికి ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,63,007 కనెక్షన్లు ఉండగా.. అవి నేడు 2,20,881కు పెరిగాయి. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ను ఇవ్వడం ప్రారంభించారు. వైఎస్సార్ హయాంలో ఉచిత విద్యుత్ కనెక్షన్లు 1.50 లక్షలు ఉండగా.. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో 1,63,007 మాత్రమే ఉన్నాయి. కొత్త కనెక్షన్లకు కోత పెట్టగా.. ఏడు గంటల కరెంట్ కూడా ఎప్పుడు ఇస్తారో తెలిసేది కాదు.. రైతులు రేయింబవళ్లు పొలాల్లోనే కాచుకుని కూర్చోవాల్సి వచ్చేది. రాత్రి వేళల్లో కరెంట్ కాటుకు కొంత మంది ప్రాణాలు సైతం కోల్పోయారు. 2019 మే నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ఉచిత విద్యుత్ అన్నదాతలకు ఆశాదీపం అయింది. బావులు, బోర్లు, ఇతర నీటి సదుపాయం కింద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉచిత విద్యుత్‌తో బంగారు పంటలు పండిస్తున్నారు.

ఐదేళ్లలో రూ.900 కోట్ల ఖర్చు

2019 నుంచి ఇప్పటి వరకు ఉచిత విద్యుత్ ఇస్తుండటంతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.900 కోట్ల మేర భారం పడింది. ఉచిత విద్యుత్ కోసం ముగ్గురు రైతులకు ఒకటి ప్రకారం, కొన్ని చోట్ల ఇద్దరికి, ఒక్కోచోట ఒక్క రైతుకే ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ధర రూ.2 లక్షలు ఉంటుంది. ఐదేళ్లలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 58 వేల విద్యుత్ కనెక్షన్లకు గాను 30 వేల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వీటి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లు ఖర్చు చేసింది. విద్యుత్ లైన్ నుంచి బోరు పాయింట్ దగ్గరకు లైన్ వేయడానికి 180 మీటర్ల వరకు ప్రభుత్వం ఖర్చు భరిస్తుంది. 11 కేవీ లైన్ వేస్తే 180 మీటర్లకు దాదాపు రూ.60 వేలు, ఎల్‌టీ(లోటెన్షన్) లైన్ వేస్తే రూ.45 వేలు వరకు ఖర్చు వస్తుంది. అవసరాన్ని బట్టి 11 కేవీ, ఎల్‌టీ లైన్ వేస్తారు. 180 మీటర్లు దాటితే ఆ ఖర్చు రైతు భరించాల్సి ఉంది. ఐదేళ్లలో దాదాపు 58 వేల కనెక్షన్‌లకు లైన్ వేయడానికి రూ.300 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లకు మొత్తం రూ.900 కోట్లు వ్యవసాయ విద్యుత్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసింది.

అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లు

వ్యవసాయానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. దళారుల ప్రమేయం లేకుండా, రైతుల నుంచి ఒక్క రూపాయి తీసుకోకుండా అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను సరఫరా చేసి, ఏర్పాటు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కాలిపోయిన దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడానికి 24 గంటల సమయం ఉంటుంది. అయితే అంత సమయం తీసుకోకుండా ముందస్తుగానే చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఉమ్మడి కర్నూలు జిల్లాలో 250 ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు అందుబాటులో ఉన్నాయి. టీడీపీ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే కొత్తది ఏర్పాటు చేయడానికి రైతులను నెలల తరబడి తిప్పుకునే వారు. రైతులు చందాలు వేసుకొని ట్రాన్స్‌ఫార్మర్లు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా అడిగిన వెంటనే ఇస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



వెల్దుర్తి మండలం బోయినపల్లిలో కేవలం ఒక రైతుకే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దృశ్యం

9 గంటల నిరంతర విద్యుత్

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన పాలనా కాలంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇవ్వడం ప్రారంభించి, 7 గంటల పాటు విజయవంతంగా ఇచ్చారు. టీడీపీ హయాంలో ఏడు గంటల విద్యుత్‌ను విడతల వారీగా ఇచ్చేవారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే వారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇస్తున్నారు. అదీ నాణ్యమైన విద్యుత్‌ను నిరంతం ఇస్తుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకోసం సబ్ స్టేషన్లు నిర్మించడం.. కొత్త లైన్లు వేయడం తదితర పనులకు రాష్ట్ర ప్రభుత్వం వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఇదిలా ఉండగా.. రైతులు అడిగిన ప్రాంతాల్లో మాత్రమే వ్యవసాయానికి రెండు, మూడు దఫాలుగా విద్యుత్ ఇస్తున్నారు.

వ్యవసాయానికి రోజూ 5.2 మిలియన్ యూనిట్లు



రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను పగటిపూటే తొమ్మిది గంటల పాటు అందిస్తున్నాం. రోజుకు వినియోగించే విద్యుత్‌లో 30 శాతంపైగా వ్యవసాయానికే ఖర్చవుతోంది. రోజుకు 5.2 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. విద్యుత్ వినియోగం సమస్యలు రాకుండా తగినన్ని సబ్‌స్టేషన్‌లను నిర్మించాం. లైన్లు కూడా అభివృద్ధి చేశాం. వ్యవసాయానికి విడుదల చేయాల్సిన కనెక్షన్లు 4000 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని కూడా త్వరలోనే విడుదల చేస్తాం.

– ఉమాపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ

దేశంలోనే ప్రథమంగా రూ.3వేల పింఛన్

- హామీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే
- జిల్లా స్థాయి పింఛన్ పెంపు ఉత్సవాల్లో ఎమ్మెల్యేలు కాటసాని, సుధాకర్
- జిల్లాలో 2,48,072 మంది లబ్ధిదారులకు రూ.3 వేలు చొప్పున పంపిణీ
- 3,374 మందికి నూతన పింఛన్ల అందజేత



నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, సుధాకర్, చిత్రంలో కలెక్టర్ సృజన తదితరులు

కర్నూలు(సెంట్రల్): దేశంలో అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులకు రూ.3 వేల చొప్పున పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, ఈ ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జే.సుధాకర్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని రూ. 3 వేలకు పెంచి ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారన్నారు. పింఛన్ పెంపు ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా స్థాయి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనతోపాటు పాణ్యం, కోడుమూరు ఎమ్మెల్యేలు, గ్రంథాలయసంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా హాజరయ్యారు. కాకినాడలో పింఛన్ పెంపు కార్యక్రమంలో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లైవ్ స్ట్రీమింగ్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో అవ్వాతాతలు, దివ్యాంగులు పింఛన్ అందుకోవడానికి ఎన్నో ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు. పంచాయతీ కార్యాలయాల దగ్గర పడి కాపులుకాయాల్సిన పరిస్థితులు ఉండేవన్నారు. అలాంటి పరిస్థితుల నుంచి వలంటీర్ల ద్వారా పింఛన్ క్రమం తప్పకుండా ఒకటో తేదీనే తెల్లరాకముందే అందజేసేలా చర్యలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. మహిళల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లుగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి, వారి జీవన ప్రమాణాలను పెంచారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తే మరింత మెరుగ్గా సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కలెక్టర్ డాక్టర్ జి.సృజన మాట్లాడుతూ.. దేశంలోనే రూ.3 వేల పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. అవ్వాతాతలకు ఇబ్బంది లేకుండా పెన్షన్ పెంపు ఉత్సవాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లబ్ధిదారులందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాసిన లేఖతోపాటు వీడియోను అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జనవరి ఒకటో తేదీ నుంచే పెన్షన్ పెంపు ఉత్సవాలు జరుగుతున్నాయని, 8వ తేదీన ముగుస్తాయని తెలిపారు. జిల్లాలో 2,48,072 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.74.45 కోట్లను ప్రతి నెలా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. జనవరిలో కొత్తగా 3,374 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు.

ప్రభుత్వ సాయంతో జీవనం



నా భర్త అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పుడు ఏమి చేయాలో దిక్కుతోచలేదు. ఎలా బతకాలో తెలియక ఆందోళన పడ్డా. టీడీపీ హయాంలో పెన్షన్ మంజూరు కోసం వెళ్తే ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక.. వలంటీర్ ఇంటి దగ్గరికి వచ్చి పింఛనుకు దరఖాస్తు చేయించి, మంజూరయ్యేలా చేశారు. నాకు ప్రతి నెలా ఇప్పటి వరకు రూ.2,750 వచ్చేది. కొత్త సంవత్సరంలో రూ.3 వేలు ఇస్తున్నారు. ప్రభుత్వ సాయంతో ఎవరిపై ఆధారపడకుండా జీవనం చేస్తున్నాం.

– బోయ రామేశ్వరి, బలిజ వీధి, కర్నూలు

పెద్దన్నలా ఆదుకున్నారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగులను పెద్దన్నలా ఆదుకున్నారు. నా కుమార్తె రష్మిక పుట్టుకతోనే మూగ, బధిర సమస్యలతో ఇబ్బంది పడుతోంది. నాకున్న ఆర్థిక ఇబ్బందులతో కుమార్తెను పోషించుకోవడం సవాలుగా ఉండేది. అయితే జగనన్న దివ్యాంగులకు అన్ని రకాలుగా చేయూతను ఇస్తున్నారు. నెలకు రూ.3 వేల పెన్షన్‌తోపాటు త్రిచక్రవాహనాలు ఇస్తున్నారు. గతంలో పెన్షన్ మంజూరు కావాలంటే డబ్బులు ఇచ్చినా పట్టించుకునేవారు కాదు. ఇప్పుడు ఆ పరిస్థితిలేదు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– జానకమ్మ, బుధవారపేట, కర్నూలు

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దే ఓటు

కర్నూలు(సెంట్రల్): 80 ఏళ్లు దాటిన వృద్ధులు, 60 శాతం వికలత్వం ఉన్న వికలాంగులు ఇంటి నుంచే ఓటు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. ఇంటి దగ్గరే ఓటు వేస్తామని ఒక్కసారి దరఖాస్తు చేసుకున్నాక తిరిగి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే అవకాశం ఉండదని చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముసాయిదా జాబితాలో సవరణలు కోరుతూ వచ్చిన అర్జీల్లో కర్నూలు మూడో స్థానంలో ఉందన్నారు. నెల్లూరు, విశాఖపట్నం జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయన్నారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఏమైనా సమస్యలు తెలియజేయాలని ఈఆర్వోలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ, ఆయా పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీశైలం డ్యాంలో 49 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాంలో బుధవారం సాయంత్రం నాటికి 49.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మంగళవారం నుంచి బుధవారం వరకు జలాదిగువ ప్రాంతాలకు 3,218 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. హంద్రీనీవా సుజలస్రవంతికి 960 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,442 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జలాశయం నీటిమట్టం 829.80 అడుగులకు చేరుకుంది.

కల్లూరులో నేడు సామాజిక బస్సు యాత్ర

- హాజరుకానున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ ప్రజాప్రతినిధులు
- జగన్ పాలనలో చేకూరిన మేలును వివరించనున్న నేతలు
- సాయంత్రం 4 గంటలకు చెన్నమ్మ సర్కిల్‌లో బహిరంగ సభ



సామాజిక సాధికార సభ నిర్వహించే చెన్నమ్మ సర్కిల్

పాణ్యం: అగ్రవర్ణాలతో సమానంగా అణగారిన వర్గాలు ఎదిగేందుకు సామాజిక న్యాయం లక్ష్యంగా ఎన్నో అవకాశాలు .. బడుగు బలహీన వర్గాలు పేదరికం నుంచి బయటపడేందుకు ఎన్నో సంక్షేమ పథకాలు.. ఇది జగనన్న జనరంజక పాలనకు నిదర్శనం. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ , మైనార్టీల జీవితాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. ఈ నేపథ్యంలో బడుగు, బలహీన వర్గాల వారిని ఆత్మీయంగా పలకరించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు చేపట్టిన సామాజిక సాధికార యాత్ర గురువారం పాణ్యం నియోజకవర్గానికి రానుంది. ఈ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ ప్రకటించి హామీలు పక్కాగా అమలు చేసింది. మంత్రి వర్గంలో మొదలుకొని ఎంపీటీసీ వరకు అన్నింటిలోను పెద్ద పీట వేసింది. 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించింది. ఆయా వర్గాలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వస్తున్నారు. చెన్నమ్మ సర్కిల్‌లో జరిగే బస్సు యాత్రకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బహిరంగా సభలో వైఎస్సార్‌సీపీ జెండాలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోల ఫ్లెక్సీలతో పట్టణం శోభాయమానంగా మారింది.


బస్సు యాత్ర షెడ్యూల్ ఇలా..

మధ్యాహ్నం 12 గంటలకు కర్నూలులోని గుత్తి పెట్రోల్ బంక్ వద్ద ఉన్న కేఎస్ఆర్ కన్వెన్షన్‌లో మేధావులు, స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పాటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల సమావేశం ఉంటుంది. 1.40కి భోజన విరామం. 2 గంటలకు ప్రెస్‌మీట్. 3 గంటలకు సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. బస్సు ముందు భారీ సంఖ్యలో బైక్ ర్యాలీ ఉంటుంది. కల్లూరులోని చెన్నమ్మ సర్కిల్‌కు సాయంత్రం 4 గంటలకు చేరుకుంటుంది. అక్కడ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.

హాజరు కానున్న ప్రజాప్రతినిధులు

సామాజిక సాధికార బస్సు యాత్రకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, హిందూపురం, తిరుపతి, కర్నూలు ఎంపీలు గోరంట్ల మాధవ్, గురుమూర్తి, డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్‌తో పాటు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆయా సామాజిక వర్గాల నేతలు హాజరుకానున్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం



అట్టడుగు వర్గాలకు ఆర్థిక, సాంఘిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యమిచ్చిన విషయాన్ని ప్రజలకు తెలియజెప్పేందుకు కల్లూరు మండలానికి వస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రతి ఒక్కరూ మద్దతు పలికి విజయవంతం చేయాలి. గ్రామ పంచాయతీ మొదలు శాసన సభ, మండలి వరకు నిర్దేశించిన లక్ష్యాలను మించి ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు అధి కారంలో సింహభాగం అవకాశాలు కల్పించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం వరకు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

– ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

హామీ నిలబెట్టుకున్న సీఎం జగన్



ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సన్మానిస్తున్న తెర్నేకల్ గ్రామస్తులు

- హంద్రీపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.43.80 కోట్లు మంజూరు
- జీఓ విడుదల చేసిన ప్రభుత్వం

ఎమ్మిగనూరుటౌన్: గంజిహళ్లి, తెర్నేకల్ గ్రామాల మధ్య ఉన్న హంద్రీనదిపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని గత ఏడాది అక్టోబర్ 19న ఎమ్మిగనూరుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి విన్నపం మేరకు సీఎం స్పందించారు. హామీని నిలబెట్టుకుంటూ హంద్రీనదిపై హైలెవల్ డబుల్ లైన్ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.43.80కోట్లు మంజూరు చేశారు. ఈ మేరకు జీఓ నంబర్ 716ను జారీ అయ్యింది. దీంతో బుధవారం తెర్నేకల్ గ్రామ సర్పంచ్ అరుణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వీరన్నతో పాటు గ్రామ పెద్దలు ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని కలిసి శాలువా, పూలమాలతో సత్కరించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే దేవనకొండ మండలంలోని పలు గ్రామాల ప్రజలు, రైతులు ఎమ్మిగనూరుకు రాకపోకలు సులువుగా సాగించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాచాని వెంకటేష్, పార్టీ నాయకులు రాఘవేంద్ర, రామానాయుడు, నాగరాజు పాల్గొన్నారు.

బ్యూటీ పార్లర్ కోర్సులో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్):కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలకు బ్యూటీపార్లర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు చదవడం, రాయడం వచ్చిన మహిళలకు ఈనెల 13 నుంచి 30 రోజుల పాటు ఉచిత భోజనం, హాస్టల్ వసతితో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు 63044 91236 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1.అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం GO లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.

a) అంగన్వాడీ హెల్పర్‌ను అంగన్వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.

b) అంగన్వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్వాడీ హెల్పర్లకు త్రైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/2023/PROG-I-A1,dt 20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

c) అంగన్వాడీ వర్కర్లు - హెల్పర్ల కొనసాగింపుకు గరిష్ఠ వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.

d) అద్దెలు (Rs.66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWC ల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ.6.36 Crs) కోసం బడ్జెట్లు విడుదల చేయబడ్డాయి.

2.అంతేకాకుండా 2019 నుండి

a) అంగన్వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.

b) 2013 నుంచి అంగన్వాడీల కార్యకర్తలకు, సూపర్వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్-2 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.

c) ఇదే సందర్భంలో ఈ సూపర్వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.

d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డిబీటి ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.

e) ఈ ఏడాది నుంచి అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత భీమాను కూడా వర్తింపు చేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.

f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.

3.జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్వాడి సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.

4.సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWW లు & AWH లు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ఆరోగ్య పారామితులపై పర్యవేక్షణ జరగటం లేదు.

5.పైన పేర్కొన్న అంశాల దృష్ట్యా, అంగన్వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.

6.పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అదించటానికి, అంగన్వాడి సెంటర్లను నిర్వహించటానికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయదానికి, జివిడబ్ల్యువి & వియస్డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.

7.కాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలు దఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలిసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంటు కూడా అందరు అంగన్వాడీ కార్యకర్తలకు బల్క్ ఎస్.ఎం.ఎస్ ను పంపించి సమ్మెను విరమించకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 29.6%, 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎస్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దిన్ని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాధమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవలని మనవి చేస్తున్నాం. గర్భివతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగ విదులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింప చెయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనల అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు
జిల్లా కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్, కర్నూలు జిల్లా.

శ్రీరంగాపురం.. ప్రగతికి మార్గం

- ఈకో జెర్మన్ టెక్నాలజీతో బీటీ రోడ్డు
- పాలుట్ల రంగస్వామి దర్శనానికి తొలగిన ఇబ్బందులు
- గ్రామంలో ఇంటింటికీ కుళాయి




గోవర్ధనగిరి టు శ్రీరంగాపుం వేసిన బీటీ రోడ్డు, గ్రామంలో పూర్తిచేసిన ఇంటింటి కులాయి పథకానికి నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు



వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్షేమంతోపాటు అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోంది. మారుమూల పల్లెల్లో సైతం మౌలిక వసతుల కల్పనకు నిధులు ఖర్చు చేస్తోంది. వెల్దుర్తి మండలంలోని శ్రీరంగాపురం గ్రామమే ఇందుకు ఉదాహరణ. శ్రీరంగాపురం గ్రామ పంచాయతీ పరిధిలో శ్రీరంగాపురం, లక్షుంపల్లె, చిన్న కొలుములు పల్లె గ్రామాలు ఉన్నాయి. మొత్తం 2,020 మంది ఆయా గ్రామాల్లో నివాసం ఉంటున్నారు. రహదారి సౌకర్యం లేక 50 ఏళ్లుగా వీరు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మట్టి రోడ్డు కావడం వాగులు, వంకలు ఉండటంతో 108 వాహనంతోపాటు ఆటోలు సైతం ఈ గ్రామాలకు వచ్చేవి కాదు. మోటారు సైకిళ్లపై అతికష్టం మీద ప్రయాణం సాగించేవారు. పాలుట్ల రంగస్వామి ఆలయానికి వెళ్లే వారు దారి సౌకర్యం లేక తీవ్ర ఇక్కట్లకు గురయ్యేవారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి వెళ్లాలన్నా కష్టంగా ఉండేది. గతంలో పాణ్యం నియోజకవర్గంలో వెల్దుర్తి మండలం ఉన్న కాలంలో అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి గోవర్ధనగిరి నుంచి శ్రీరంగాపురానికి రోడ్డు మంజూరు చేయించి పని ప్రారంభించినా మధ్యలో కొందరు భూ యజమానులు, రైతుల అభ్యంతరాలు తెలపడంతో పూర్తి కాలేదు. ఏళ్లు గడిచినా గ్రామస్తుల రహదారి సమస్య తీరలేదు. టీడీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి, ఆయన కుమారుడు కేఈ శ్యాంబాబు ఈ సమస్యను పట్టించుకోలేదు. 2019 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సమస్య ఉన్న పొలాల వద్ద మట్టి రోడ్డుతో పనికానిచ్చి మమ అనిపించారు.

చొరవ చూపిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

ఎన్నికల సమయంలో శ్రీరంగాపురం గ్రామానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంగాటి శ్రీదేవిని గ్రామస్తులు రహదారి వేయించాలని, తాగునీటి సమస్య తీర్చాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాలకు రహదారి వేసేందుకు ముందు భూ యజమానుల, రైతుల సమస్య తీర్చారు. అనంతరం బీటీ రోడ్డు ప్రతిపాదనను సీఎం జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. దీంతో ఏసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) నిధులతో గోవర్ధనగిరి నుంచి లక్షుంపల్లె మీదుగా శ్రీరంగాపురం వరకు 4.1కి.మీల మేర రోడ్డు రూ.3.07 కోట్ల నిర్మించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి సారిగా ప్రత్యేకంగా ఈకో జర్మన్ టెక్నాలజీతో బీటీ రోడ్డు (ఈ రోడ్డు 20 ఏళ్ల పాటు పటిష్టంగా ఉంటుంది) వేశారు. అలాగే గోవర్ధనగిరి నుంచి ఎల్ కొట్టాల, పేరేములకు సైతం సీసీ రోడ్లు వేయించారు. దీంతో శ్రీరంగాపురం గ్రామాభివృద్ధికి బాటలు పడ్డాయి. గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. శ్రీరంగాపురం, లక్షుంపల్లె గ్రామస్తుల కోరిక మేరకు రహదారి మధ్యలో వంక ప్రవహించే ప్రాంతంలో కల్వర్టులు నిర్మించేందుకు పనులు ప్రారంభం కానున్నాయి. త్వరలో కల్వర్టు పనులు పూర్తి చేసి రోడ్డు ప్రారంభించనున్నట్లు సంబంధిత పీఆర్‌పీఐయూ అధికారులు తెలిపారు. అదే విధంగా పాలుట్ల రంగాస్వామి ఆలయానికి సైతం కొండల్లో అక్కడక్కడా సీసీ రోడ్ల నిర్మాణాలతో ఘాట్ రోడ్డు నిర్మించి మార్గం సుగమం చేశారు.

రూ.40 లక్షలతో ఇంటింటికీ కుళాయి

శ్రీరంగాపురం గ్రామానికి నీటి సమస్య తీర్చడానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మరో అడుగు ముందుకు వేశారు. జల్ జీవన్ మిషన్ కింద రూ.40లక్షలతో పనులు పూర్తి చేశారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించి, నీటి పథకం బోరు వేయించి పైప్‌లైన్ పనులు పూర్తి చేసి ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసి నీరందిస్తున్నారు. లక్షుంపల్లెలో సైతం రూ.12లక్షలతో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేశారు. చిన్న కొలుముల పల్లెకు మంజూరైన రూ.25లక్షల ఇంటింటి కుళాయి పనులు టెండరు దశలో ఉన్నాయి.

సమస్యలు తొలగాయి



మా గ్రామానికి రహదారి సౌకర్యం లేక ఏళ్ల తరబడి చాలా ఇబ్బందులు పడ్డాం. ఆసుపత్రికి వెళ్లలేక కొందరు మృత్యువాత పడ్డారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ, చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి చొరవ తీసుకుని మా గ్రామ సమస్యలు పరిష్కరించారు. బీటీ రోడ్డు నిర్మాణంతో ప్రయాణాలు సాఫీగా సాగుతున్నాయి. ఇక ఇంటింటికీ కుళాయితో మరో ప్రధాన సమస్య తీరింది. గ్రామస్తులందరూ ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు రుణపడి ఉంటారు.

– గోపాల్, శ్రీరంగాపురం

దుండగుల దుశ్చర్య

- 132 చెట్లు నరికివేత



పొలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

రుద్రవరం: గుర్తు తెలియని దుండగులు పచ్చటి చెట్లను నరికేశారు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కొండమాయపల్లెకు చెందిన రైతు కట్టుబడి పెద్ద జమాల్ వెలగలపల్లె పొలిమేరలో సర్వే నంబర్లు 42, 51లోని 1.10 ఎకరాల్లో రెండేళ్ల క్రితం మామిడి, కొబ్బరి, చీనీ మొక్కలు నాటాడు. ఏపుగా పెరుగుతున్న క్రమంలో కొందరు దుండగులు మంగళవారం అర్ధరాత్రి గొడ్డళ్లతో నరికి నేలమట్టం చేశారు. దిన చర్యలో భాగంగా రైతు ఉదయం అంతర్ పంటగా సాగు చేసిన మినుమును చూసేందుకు వెళ్లగా నేలకూలిన చెట్లను చూసి బోరున విలపించాడు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి, సిబ్బందితో పొలం వద్దకు వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాయింట్ సర్వే నెలలోపు పూర్తవ్వాలి



మాట్లాడుతున్న జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): అటవీ భూముల సంరక్షణకు జాయింట్ సర్వేను నెల రోజుల్లోపు పూర్తి చేయాలని జేసీ నారపురెడ్డి మౌర్య రెవెన్యూ, అటవీ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి అటవీ సంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ భూముల ఆక్రమణపై ఉక్కుపాదం మోపాలన్నారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అటవీశాఖ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కాగా, భూముల రీసర్వే సమయంలో అటవీ శాఖ అధికారులు పాల్గొని సరిహద్దులను గుర్తించాలన్నారు. ఆదోని పరిధిలోని కోసిగి గ్రామ శివారులోని కొండలపై చిరుత పులి సంచారం ఉందన్న విషయాన్ని రెవెన్యూ అధికారులు జేసీ దృష్టికి తీసుకురాగా అటవీ, రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో చిరుత పులిని అక్కడి నుంచి పంపేందుకు చర్యలు తీసుకోవాలని ఆదోనిసబ్ కలెక్టరకు ఆదేశాలు ఇచ్చారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, డీఎఫ్ఓ శివశంకర్‌రెడ్డి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు పాల్గొన్నారు.


ఉరుకుందలో రూ.35 లక్షలతో శౌచాలయాలు



స్థలాన్ని పరిశీలిస్తున్న ఆలయ అధికారులు

మంత్రాలయం: ప్రముఖ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా శౌచాలయాలు నిర్మించనున్నారు. రూ.35 లక్షలు వెచ్చించి 20 శౌచాలయాలు, దుస్తుల మార్పిడి గదులు కట్టనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజుగౌడ్, అసిస్టెంట్ కమిషనర్ కె.వాణి స్థలాన్ని పరిశీలించారు. భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు ఆదోని రోడ్డులోని తుంగభద్ర దిగువ కాలువ చెంతన శౌచాలయాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రావణ మాస ఉత్సవాలకు నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని చెప్పారు. స్థల పరిశీలనలో సూపరింటెండెంట్లు రామ్మోహన్‌రావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పీఎం యశస్వీ దరఖాస్తులను పరిశీలించి పంపండి



మాట్లాడుతున్న నోడల్ అధికారిణి వెంకటలక్షుమ్మ

కర్నూలు(అర్బన్): పీఎం యశస్వీ పథకం కింద ఈబీసీ, ఓబీసీ, డీఎన్‌టీ వర్గాలకు చెందిన విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తులను పరిశీలించి తమ లాగిన్‌కు పంపించాలని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి, పీఎం యశస్వీ నోడల్ ఆఫీసర్ పి.వెంకటలక్షుమ్మ కోరారు. బుధవారం తన కార్యాలయంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన టాప్ క్లాస్ స్కూల్స్‌లో 9వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆయా సామాజిక వర్గాల విద్యార్థినీ, విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారన్నారు. ఈ విద్యార్థులకు 9, 10 తరగతులకు చెందిన వారికి ఏడాదికి రూ.75 వేలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.1.25 లక్షలను ఈ పథకం కింద ఉపకార వేతనం అందుతుందన్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 15వ తేదికి ముందు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా విద్యార్థుల బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందన్నారు. సమావేశంలో వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు ఎం.షేక్షావలి, రయిస్ అహమ్మద్, జవహర్, ఎస్.జయమ్మ, యమునాదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బావుటా

జగన్‌కు రుణ పడి ఉంటాం



మా కుటుంబానికి ఎంతో అండగా నిచిలిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మాకు ఏడవ తరగతి చదువుతున్న వరుణ్ సందీప్, నాల్గవ తరగతి చదువుతున్న ఊహమేఘవర్షిత సంతానం. రెండేళ్ల క్రితం నా భర్త రామకృష్ణయ్య అనారోగ్యంతో చనిపోయా డు. కుటుంబ పెద్దను కోల్పోయి కష్టాల్లో ఉన్న మా కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా సహాయం అందించింది. భర్త చనిపోవడంతో వైఎస్సార్ బీమా పథకం కింద రూ. లక్ష ఆర్థిక సాయం అందింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పిల్లల చదువుకు అమ్మఒడి, వ్యవసాయానికి సంబంధించి ఏటా రూ. 13,500 పెట్టుబడి సాయం, జగనన్న చే దోడు పథకం ద్వారా రూ. 10 వేల ఆర్థికసా యం, వైఎస్సార్ ఆసరా పథకాలు వర్తించా యి.ప్రతి ఏటా ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బులను కుటుంబ పోషణ, పిల్లల చదువుకు వినియోగించుకుంటూ జీవనం సాగిస్తున్నాను.

– ఈడిగ రాధిక, వల్లంపాడు గ్రామం, కోవెలకుంట్ల మండలం

సంక్షేమ పథకాలు ఆదుకున్నాయి



గతంలో మాలాంటి మధ్య తరగతి కుటుంబాలకు పథకాలు వచ్చేవి కావు. ప్రతి నెల వృద్ధాప్య ఫించన్ ఒకటో తేదీన మా వలంటీర్ లక్ష్మీదేవి ఇంటికొచ్చి ఇస్తోంది. ఈ నెల నుంచి రూ. మూడు వేలు ఇస్తున్నారు. రైతు భరోసా కింద గత నాలుగు సంవత్సరాలుగా ఏటా రూ. 13,500లు ఆర్థిక సహాయం అందింది. చేదోడు పథకం కింద రూ. 10 వేలు అందుకున్నా. జగనన్న పాలనలో మా కుటుంబం ఇప్పుడిప్పుడే ఆర్థికంగా కుదుట పడింది. నాకున్న 3.77 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశా. ఎలాంటి అప్పులు చేయకుండా రైతు భరోసా ద్వారా అందిన డబ్బులు రసాయనిక ఎరువులు, విత్తనాలకు ఉపయోగపడింది. మాలాంటి పేదలకు ఎంతో సహాయం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలవాలి.

– మంగలి నాగరాజు, ఉయ్యాలవాడ

ఊర్లోనే రిజిస్ట్రేషన్ చేశారు



జగనన్న భూ హక్కు–భూ రక్ష పథకంలో భాగంగా మా ఊరు కొత్తూరును పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా సర్వే చేశారు. పొలాలకు హద్దు రాళ్లు కూడా పాతారు. అంతేకాకుండా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మా గ్రామంలోని సచివాలయంలో నేను మొదటి సారిగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. గతంలో ఏదైనా పొలం రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే 16 కిలోమీటర్లు ప్రయాణించి పాణ్యానికి వెళ్లేవాళ్లం. డాక్యుమెంట్ల కోసం రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రోజుల తరబడి నిరీక్షించే వాళ్లం. చలానాలతో పాటు అదనంగా ఖర్చు వచ్చేది. సచివాలయాల్లో రిజిస్ట్రార్ చేయడం వల్ల కేవలం చలానా డాక్యుమెంట్ల వరకు మాత్రమే ఖర్చు వస్తోంది. తక్కువ సమయంలోనే రిజిస్ట్రార్ చేసి ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– బీరం శోభాదేవి, కొత్తూరు గ్రామం, పాణ్యం మండలం

సంతోషంగా ఉన్నాం



టీడీపీ హయాంలో ప్రభుత్వ సాయం నామమాత్రంగా ఉండేది. ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకునే వారు ఉండేవారు కాదు. అప్పులు చేయాల్సిన దుస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రజల కష్టాలు తొలగాయి. నాకు ప్రతి నెలా పింఛన్ వస్తోంది. పంట సాగుకు ముందే రైతుభరోసా అందుతోంది. రూపాయి ఖర్చు లేకుండా పంటల బీమా సదుపాయాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోంది. నా భార్య గోవిందమ్మకు ఆసరా, చేయూత, సున్నా వడ్డీ పథకాలు అందాయి. వీటి ద్వారా వచ్చిన నగదుతో రెండు గేదెల్ని కొనుక్కొని కుటుంబానికి అండగా నిలిచింది. నాకుమారుడు ఆదినారాయణకు రైతు భరోసా పథకం వస్తోంది. కుమారుడి భార్య మహేశ్వరి అమ్మఒడి, సున్నా వడ్డీ పథకాలతోపాటు జగనన్న కాలనీలో స్థలం వచ్చింది. ప్రభుత్వం సమకూర్చిన రూ.1.80 లక్షలతో ఇల్లు సైతం నిర్మించుకున్నాం. గతంలో ఇలాంటి పథకాలు లేవు. ఎవరి సిఫార్సులు లేకుండా వలంటీర్ల ఇంటి వద్దకే వచ్చి సాయం అందిస్తున్నారు. ఈ ప్రభుత్వంలో మేం చాలా సంతోషంగా ఉన్నాం.

–మండ్ల రామగోవిందు, సోమాపురం, గడివేముల మండలం

మత్స్యకార సంఘం ప్రమాణ స్వీకారం


కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లా మత్స్యకార సహకార సంఘం కార్యవర్గ సభ్యులు బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు గూడూరు శ్రీనివాసులు మాట్లాడుతూ... జిల్లాలో మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫిషర్‌మెన్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, అఖిల భారత మత్స్యకార సంఘం ఆర్గనైజర్ ఉండవల్లి వెంకటన్న, డైరెక్టర్లు మల్లీశ్వరుడు, ప్రాతకోట వెంకటేష్, పోతుల శేఖర్, చెంచులన్న, భాస్కర్, నగేష్, నాగశేషు, మద్దిలేటి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బైజూస్ సెంటర్‌పై దాడి.. కేసు నమోదు

కర్నూలు: నగర శివారులోని నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని రిలయన్స్ మాల్‌పైన ఉన్న బైజూస్ ట్యూషన్ సెంటర్‌పై దాడికి పాల్పడ్డారన్న కారణంతో ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపై మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు సోమన్న, శివారెడ్డి, షామీర్ బాషా, విజయేంద్ర, రంగస్వామి, మునిస్వామి, థామస్, అల్తాఫ్, సురేంద్ర, జాన్సన్ బాబు, అశోక్, శ్రీనివాసులు, బాబయ్య, బీసన్నల ఆధ్వర్యంలో రిలయన్స్ మాల్‌పై ఉన్న బైజూస్ టూషన్ సెంటర్‌లోకి అక్రమంగా ప్రవేశించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, బడి పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చే విషయంలో నినాదాలు చేస్తూ ఆఫీస్ ఫర్నీచర్‌ను ధ్వంసం చేసినట్లు బైజూస్ టూషన్ సెంటర్ సర్వీస్ కౌన్సిలర్ నరసింహులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మూడో పట్టణ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ వాసి దుర్మరణం



మృతుడు బకరే ఖుశాల్ (ఫైల్)

మంత్రాలయం: మండలంలోని కల్లుదేవకుంట గ్రామ సమీపంలో బుధవారం వేకువజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌కు చెందిన బకరే ఖుశాల్ మృత్యువాత పడ్డాడు. వివరాలివి.. శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం కాలినడకన నిజామాబాద్ జిల్లా మద్నూర్ మండలం హండే కెలూరు గ్రామానికి చెందిన బకరే ఖుశాల్ మంత్రాలయం వస్తున్నారు. మంత్రాలయానికి 4 కి.మీ. దూరంలో వేకువజామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత బలవన్మరణం

కర్నూలు: పాతబస్తీలోని బేకార్‌కట్టలో నివాసముంటున్న రుకియా బేగం (32) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నందికొట్కూరుకు చెందిన ఈమెకు 2008లో కర్నూలుకు చెందిన జుబేర్‌తో వివాహమయ్యింది. ఆయన పిండి మిషన్ నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాలు చోటు చేసుకుని ఆమె తీవ్ర మనస్తాపానికి గురయ్యింది. మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు ఆలస్యంగా కనుగొని ఉరి నుంచి తప్పించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఆమె తల్లి అబిదా బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణి ప్రాణం తీసిన తోపులాట



వీరేశమ్మ (ఫైల్)

కోసిగి: తోపులాటలో గాయపడి అగసనూరు గ్రామానికి చెందిన గర్భిణి వీరేశమ్మ (20) మృతి చెందారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోని మండలం బల్లేకల్లు గ్రామానికి చెందిన కమేలేష్‌తో మూడేళ్ల క్రితం వీరేశమ్మకు వివాహమైంది. మొదటి కాన్పు నిమిత్తం అగసనూరు గ్రామానికి వచ్చింది. ఆమె తొమ్మిది నెలల గర్భిణి కావడంతో వైద్యాధికారులు ఈ నెలలో ప్రసవం తేదీ కూడ ఇచ్చారు. అయితే మంగళవారం రాత్రి అగసనూరు గ్రామంలో నిర్వహించిన దేవరలో తోపులాట జరిగి.. ఆమె కిందకు పడి పోయి స్పృహకోల్పోయింది. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనంలో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో ఆమె మృతి చెందింది. నిండు గర్భిణీ మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతదేహాన్ని భర్త గ్రామం బల్లేకల్లుకు తీసుకెళ్లారు.

కొండను ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామంలో ఓ లారీ కొండను ఢీకొడంతో ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల పట్టణం గుడిపాటి గడ్డలో నివాముంటున్న శ్రీనివాసులు (46)లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కందికాయపల్లె గ్రామంలో జరుగుతున్న సోలార్ పరిశ్రమలకు సంబంధించి ప్యానెళ్లను లారీలో తీసుకెళ్తుండగా లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న కొండను ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాసులుకు గాయాలు కాగా శాంతిరాం ఆసుపత్రికి తరలించగా..చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య మహేశ్వరి, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి

ఆత్మకూరు: మహానందిలో శతాధిక వృద్ధురాలు మామిళ్లపల్లి సుబ్బలక్ష్మమ్మ(102) బుధవారం మృతి చెందారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకరు మహానంది ఆలయ ప్రధానార్చకులుగా, మరొకరు ముఖ్యఅర్చకులుగా కొనసాగుతున్నారు. మహానంది దేవస్థానంలో పలువురు సుపరిచితులు కావడంతో ఈమె మృతికి సంతాపం తెలిపారు.